క్లుప్తంగా

క్రీడాకారుడికి సన్మానం



చెన్నంపల్లిలో వెంకటేష్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

తుగ్గలి: ట్రయాథ్లాన్ ఈవెంట్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారుడిని బుధవారం చెన్నంపల్లి గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన దండు వెంకటేశ్వర్లు కాకినాడలో డిగ్రీ చదువుతున్నాడు. గత నెల 26, 27 తేదీల్లో గోవాలో నిర్వహించిన ట్రయాథ్లాన్ ఈవెంట్‌లో ఏపీ తరఫున పాల్గొన్న వెంకటేశ్వర్లు మూడో స్థానంలో నిలిచారు. దీంతో ఆ క్రీడాకారుడిని జెడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు, సర్పంచ్ గౌరవ సలహాదారు వెంకటపతి, గ్రామస్తులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

దీపావళి వెలుగులు నింపాలి



బాణసంచా, స్వీట్‌బాక్స్‌లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.మురళీధర్‌రెడ్డి

పత్తికొండ రూరల్: దీపావళి కాంతులతో ఇంటింటా ఆనందం వెల్లివిరియాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం పత్తికొండలోని కన్యకా పరమేశ్వరీ కల్యాణ మండపంలో పోచిమిరెడ్డి సేవాదళ్ ఆధ్వర్యంలో పత్తికొండలోని 3 వేల కుటుంబాలకు బాణసంచా, స్వీట్‌బాక్స్‌లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజల కోసం సేవాదళ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. నాయకులు కోటేశ్వరరావు, ఎంపీటీసీలు అనిత, సరోజ, వార్డు మెంబర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో వైకల్య శాతం తగ్గుముఖం

కృష్ణగిరి: అంగవైకల్యం ఉన్న చిన్నారులకు తల్లిదండ్రులు ఇంటి వద్ద క్రమం తప్పకుండా వ్యాయామం చేయించాలని ఫిజియోథెరపీ వైద్యులు రవీంద్రనాయక్ సూచించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం ఆయన అంగవైకల్యం గల చిన్నారులకు వ్యాయామం చేయించారు. అంగ వైకల్యానికి వ్యాయామమే సరైన చికిత్స అన్నారు. నిత్యం ఇలా చేయించడం ద్వారా నరాలు బలపడి కొంతవరకు ఉపశమనం కలుగుతుందన్నారు. ప్రతి వారం నిర్వహించే శిబిరానికి మండలంలోని దివ్యాంగ పిల్లలను తల్లిదండ్రులు తప్పక తీసుకరావాలని ఆయన కోరారు. ఐఈఆర్‌టీ శేఖర్ పాల్గొన్నారు.

చిన్నోడా.. పాముతో ఆటలొద్దు



పొలంలో కనిపించిన పామును పట్టుకున్న ప్రసాద్

వెల్దుర్తి(కృష్ణగిరి): పాము అంత దూరం కనిపించినా చాలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగు తీస్తాం. అలాంటిది ఓ పిల్లాడు పాముతో ఆడుకోవడం, స్నేహితులు తీసిన ఆ వీడియో సామాజిక మాధ్య మాల్లో వైరల్‌గా మారింది. కలుగొట్ల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు రెండో కుమారుడు ప్రసాద్ 5వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం పాఠశాల విడిచిన తర్వాత తన ఇద్దరు స్నేహితులతో కలిసి పొలానికి వెళ్లారు. ఆ సమయంలో ఓ పాము కనిపించగా ప్రసాద్ దాన్ని పట్టుకొని విన్యాసాలు చేశాడు. ఏడెనిమిది అడుగుల పాము తో ఆ పిల్లాడు ఆడుకుంటుండగా అతనితో పాటు వెళ్లిన మరో పిల్లాడు ఫోన్‌లో చిత్రీకరించాడు. కొద్దిసేపటి తర్వాత పామును వదిలి ఇంటికి చేరుకున్నారు. ఆ ఫొటోలను చూసి కుటుంబ సభ్యులు చీవాట్లు పెట్టారు. బుధవారం ఫొటోలు, వీడియో సోషల్ మీడియాలో షేర్ కావడంతో గ్రామస్తులు నోరెళ్లబెట్టారు. అయితే ఆ పాము జెర్రిపోతు విషపూరితమైనది కాకపోవడం మంచిదైందని.. అయి నా పాములతో ఆటలు మంచిది కాదని హితబోధ చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఎమ్మిగనూరుటౌన్: మన్యం జిల్లా పార్వతీపురంలో ఈనెల 10వ తేదీ వరకు జరుగనున్న రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ కరాటే పోటీలకు పట్టణంలోని ఎంఎస్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. 14 సంవత్సరాల్లోపు బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన బి.చైత్ర, 17 సంవత్సరాల్లోపు విభాగంలో హేమావతి, నందిని ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్లు సుజనకుమారి, నాగేశ్వరి బుధవారం తెలిపారు.

నీటి శుద్ధీకరణపై అవగాహన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఎస్‌హెచ్‌జీ మహిళలకు బుధవారం జల్ దివాళి(నీటి కోసం మహిళలు, మహిళల కోసం నీరు) అన్న అంశంపై మున్సిపల్ ఏఈ శరత్, మెప్మా సిబ్బంది అవగాహన కల్పించారు. స్థానిక గుడికల్ రోడ్డులోని మంచినీటి ఫిల్టర్ ప్లాంట్ వద్ద నీటిశుద్ధి, సరఫరా అనే అంశాలపై వారు వివరించారు. ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు సరఫరా చేసే ప్రక్రియను వివరించారు. మెప్మా సీఎంఎం, సీఓలు, డీఈఓ, ఆర్‌పీలు, ఓబీలు పాల్గొన్నారు.

పల్లె ముంగిటకే ప్రభుత్వ సేవలు

- వైఎస్సార్‌సీపీతోనే గ్రామ స్వరాజ్యం
- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- రాంపల్లిలో సచివాలయం, ఆర్‌బీకే భవనాలు ప్రారంభం



రాంపల్లిలో వైఎస్సార్ జలకళ బోరును ప్రారంభించిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: జాతిపిత మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేస్తూ.. పల్లె ముంగిటకే అన్ని రకాల సేవలందేలా సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తెచ్చారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. రూ.67.24 లక్షలతో రాంపల్లిలో నూతనంగా నిర్మించిన సచివాలయ, ఆర్‌బీకే భవనాలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. గతంలో రైతులు విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రాలకు, పట్టణ కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. అక్కడ క్యూలో గంటల తరబడి నిరీక్షించినా దొరికేవి కావన్నారు. పల్లెల్లో ఏర్పాటు చేసిన ఆర్‌బీకేలలో రైతులకు కావాల్సినవన్నీ దొరుకుతున్నాయన్నారు. ధ్రువపత్రాలు, వివిధ పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాలు ప్రవేశపెట్టారన్నారు. అనంతరం రైతు రాఘవయ్య పొలంలో వైఎస్సార్ జలకళ పథకం కింద తవ్విన బోరును ఎమ్మెల్యే స్విచ్చాన్ చేసి ప్రారంభించారు. బోరు నుంచి ఉబికి వస్తున్న నీటిని చూసి ఆనందంతో పొంగిపోయారు. సాగునీటి కోసం రైతులు పడుతున్న ఇబ్బందులు తీరేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉచితంగా కోట్లాది రూపాయలు ఖర్చు చేసి బోర్లు వేయడంతో పాటు, కరెంటు, మోటారుకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తోందన్నారు. పత్తికొండ క్లస్టర్‌లో 792 బోర్లు తవ్వగా, 86 బోర్లకు కరెంటు, మోటార్లు ఇచ్చి రైతులు పంటలు పండించుకునేలా చేశామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ట్రాన్స్‌కో ఏఈ మహేశ్వరరెడ్డి, ఏపీడీ పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేష్, నాగభూషణరెడ్డి, వెంకటరాముడు, మోహన్‌రెడ్డి, హనుమంతు, కోటేశ్వరరెడ్డి, ఈశ్వరరెడ్డి, రాజు, లాలన్న, సర్పంచ్ మసీంద్ర, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీదేవి పాల్గొన్నారు.

నేడు కృష్ణగిరిలో ప్రారంభోత్సవం



కృష్ణగిరిలో ప్రారంభానికి సిద్ధమైన గ్రామ సచివాలయం

కృష్ణగిరి: మండల కేంద్రమైన కృష్ణగిరిలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయంను గురువారం ప్రారంభించనున్నట్లు పీఆర్ ఏఈ అబ్దుల్ వహీద్ సాహెబ్ బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా ఈ భవనాలను ప్రారంభించడం జరుగుతుందని ఆయన చెప్పారు. మండలంలో మిగతా గ్రామాల్లో కూడా భవన నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు.

గ్యార్మీ షరీఫ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే

వెల్దుర్తి(కృష్ణగిరి): ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించే గ్యార్మీ షరీఫ్‌లో పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ వెల్దుర్తి ముస్లిం మైనారిటీ మండల కన్వీనర్ గట్టు ఆరిఫ్ కుటుంబం బుధవారం నిర్వహించిన గ్యార్మీ షరీఫ్‌లో ఆమె మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, జెడ్పీటీసీ సుంకన్న తదితరులతో కలిసి విందులో పాల్గొన్నారు.

చేసిన మేలును వివరించండి



మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలకు చేసిన మేలు, అందించిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పార్టీ శ్రేణులకు సూచించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో.. నియోజకవర్గంలో 'వై ఏపీ నీడ్స్ సీఎం జగన్' కార్యక్రమాన్ని గురువారం నుంచి ప్రారంభించాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలకు వివరించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించి ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణం



హొళగుంద బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హొళగుంద: స్థానిక బీసీ కాలనీలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం సీసీ రోడ్డు నిర్మాణం పనులను చేపట్టారు. నాయకులు ఈశా, సింగిల్ విండో చైర్మన్ మల్లికార్జున, నాయకులు కెంచప్ప, హనుమప్ప, సిద్దయ్య, శేక్షావలి తదితరులు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. చాలాకాలంగా సీసీ రోడ్డు లేక రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న విషయాన్ని ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కాలనీవాసులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి స్పందించి ప్రభుత్వం గ్రామ సచివాలయాలకు విడుదల చేసిన నిధులు రూ.20 లక్షలతో రోడ్డు పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు బుధవారం నుంచి పనులు మొదలు పెట్టి పూర్తి చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రి గుమ్మనూరు జయరాంకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా మండలంలో మొత్తం 16 గ్రామ సచివాలయాలుండగా ఇటీవలే అదనపు నిధులు ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షల ప్రకారంగా మొత్తం రూ.6.40 కోట్లు విడుదలైనట్లు నాయకులు ఈశా తెలిపారు. ఆ నిధులతో స్థానికంగా సీసీ రోడ్డు, ఇతర అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నట్లు ఆయన వెల్లడించారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి



ఎమ్మిగనూరులో ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాలు

ఎమ్మిగనూరుటౌన్: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరించడాన్ని వెంటనే ఆపాలని, అలాగే కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు మహేంద్రబాబు, విజయేంద్ర,విజయ్ రాజీవ్, సురేంద్రబాబులు డిమాండ్ చేశారు. ఆయా ఉక్కు పరిశ్రమల కోసం బుధవారం ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ,ఎస్ఎఫ్ఐ,పీడీఎస్ఓ, ఏఐవైఎఫ్‌ల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ కార్యక్రమాన్ని నిర్వహించి స్థానిక సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేశారు. కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. ఆయా విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు చిరునామా సీఎం జగన్



వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎర్రకోట జగన్

గోనెగండ్ల: రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం గోనెగండ్లలో ఏడవ రోజు 5, 6, 9వ వార్డులలో, అలాగే సాయంత్రం ఎర్రబాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న పాలనలో రైతులు, డ్వాక్రా మహిళలు, విద్యార్థులు, వృద్ధులు ఇలా అన్ని వర్గాల వారి సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందన్నారు. సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం జగనన్నకు రానున్న ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని కోరారు. ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ ఎస్‌బీ మన్సూర్, యూత్ అధ్యక్షుడు బందెనవాజ్, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, కన్వీనర్ దొరబాబు, జేసీఎస్ కన్వీనర్ మనోహర్ రెడ్డి, ఎర్రబాడు సర్పంచ్ అరుణజ్యోతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించండి

నందవరం: ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ దశరథరామయ్య పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులకు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు.. గ్రామ సచివాలయాలలో ఏర్పాటు చేయబోయే సంక్షేమ పథకాల అర్హుల జాబితా బోర్డు ఆవిష్కరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మా నమ్మకం నువ్వే జగనన్న' బోర్డు ఆవిష్కరణకు పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి గ్రామ సచివాలయంలో బోర్డులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. 9వ తేదీన నందవరం-1, 10న నందవరం-2, 14వ తేదీన నందవరం-3, 15వ తేదీన హాలహర్వి-1, 16న హాలహర్వి-2, 17న మాచాపురం, 20వ తేదీన ముగతి-1, 21న ముగతి-2, 22న నాగలదిన్నె-1, 23న నాగలదిన్నె-2లోని సచివాలయాల్లో మా నమ్మకం నువ్వే జగనన్న బోర్డులను ఆవిష్కరించాలని తెలిపారు. అందుకు ఏర్పాటు చేసుకోవాలని సెక్రటరీలకు చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు పెద్దిరెడ్డి, సుజాత, నౌసన్న, రామారావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

దేవనకొండ: మండల కేంద్రంలో గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గౌరీదేవి బుధవారం తెలిపారు. ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు. అలాగే ప్రజాప్రతినిధులు హాజరవుతారని, మండలంలో జరిగిన అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన అభివృద్ధిపై చర్చించనున్నట్లు తెలిపారు.

ఈ-క్రాప్ ధ్రువీకరణ పత్రాల పంపిణీ

మద్దికెర: పంటల నమోదు చేయించుకున్న వారికి ప్రభుత్వ పథకాలు అందించడం జరుగుతుందని ఏఓ రవి అన్నారు. బుధవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో 2023 ఖరీఫ్ సీజన్‌లో పంట నమోదు చేసుకున్న రైతులకు ఈ-క్రాప్ నమోదు ధ్రువీకరణ పత్రాలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నదాతలు తప్పనిసరిగా వ్యవసాయాధికారులు సూచనల మేరకు ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. లేనియెడల రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాలు వర్తించవన్నారు. అంతేగాక సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు మంజూరు కావన్నారు. వీఏఏలు జాకీర్, ఆనంద్, రాణి తదితరులు పాల్గొన్నారు.

రూపురేఖలు మారిన కాలనీలు



నాడు - శంకరబండ బీసీ కాలనీలో వీధిలో పారుతున్న మురుగు



నేడు - సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువతో సుందరంగా రూపుదిద్దుకున్న కాలనీ

ఆస్పరి: మండలంలోని శంకరబండ గ్రామంలోని బీసీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయడం వల్ల రూపురేఖలే మారిపోయాయి. ఎన్నో ఏళ్ల నుంచి వీధుల్లో మురుగు నీటితో ఇబ్బంది పడుతున్నా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టించుకోలేదు. గ్రామస్తులు మురుగు నీటిలోనే నడిచి వెళ్లాల్సి వచ్చేది. ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కిందపడ్డ సందర్భాలున్నాయి. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా శంకరబండ గ్రామానికి వచ్చిన కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంకు సమస్యను సర్పంచ్ విజయలక్ష్మి, గ్రామస్తులు వివరించారు. స్పందించిన మంత్రి సచివాలయం నిధులు రూ.20 లక్షలను సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటుకు మంజూరు చేశారు. సర్పంచ్ ప్రత్యేక శ్రద్ధతో బీసీ కాలనీలోని వీధుల్లో ఆక్రమణలు తొలగించి వాహనాలు వెళ్లేందుకు వీలుగా వెడల్పు చేయించారు. దస్తగిరి స్వామి దర్గా నుంచి ఊరు వాకిలి వరకు సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించడంతో కాలనీ రూపురేఖలే మారిపోయాయి. సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రి గుమ్మనూరు జయరాంకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్రరావును సన్మానిస్తున్న ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నాయకులు

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వ పెన్షనర్లకు ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్రరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ పెన్షనర్ల కార్యాలయంలో సంఘం అధ్యక్షులు ఏపీ.వీరన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్రరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు పెన్షన్ పొందేందుకు ఏమైనా సాంకేతిక సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్రరావును శాలువా కప్పి పెన్షనర్లు సన్మానించారు. స్థానిక ట్రెజరీ అధికారి రాజు, ఎస్టీవో కార్యాలయం సిబ్బంది అంజాద్‌బాషా, యాదిగిరి, పెన్షనర్ల సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి పోలుకంటయ్య తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక వాసి దుర్మరణం

దేవనకొండ: పొట్టకూటి కోసం రాష్ట్రం దాటి వచ్చిన వ్యక్తి ఎదురుగా వచ్చిన వాహనం ఢీకొట్టడంతో మృత్యువాడికి చేరాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప తాలూకా కె.బెళగల్‌కు చెందిన సురేష్, జిల్లాలోని హొళగుంద మండలం నాగరకన్వికి చెందిన హరిజన రంగనాథ్, హనుమంతు నాగరకన్వి నుంచి కోడుమూరు దగ్గరలోని గాలిమరల పనులు చేసేందుకు బైకుపై బయలుదేరారు. కర్నూలు నుంచి పత్తికొండ వైపు వస్తున్న గుర్తు తెలియని వాహనం ఈదులదేవరబండ వద్ద వారిని ఢీకొట్టింది. ప్రమాదంలో సురేష్ (25) అక్కడికక్కడే మృతిచెందాడు. రంగనాథ్, హనుమంతుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయాలపాలైన వారిని 108 వాహనంలో కర్నూలుకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సురేష్‌కు భార్య అఖిల, ఇద్దరు పిల్లలు ఉన్నారు

లారీ ఢీకొని బైకిస్టుకు గాయాలు

వెల్దుర్తి(కృష్ణగిరి): హైవే-44పై గుర్తు తెలియని లారీ ఢీకొట్టడంతో బైకిస్టు గాయపడ్డాడు. కోడుమూరు మండలం వెంకటగిరికి చెందిన గిడ్డయ్య బైక్‌పై తన కుమార్తెను డోన్ పాఠశాలలో వదలి స్వగ్రామానికి తిరుగుప్రయాణమయ్యాడు. వెల్దుర్తి వద్ద హోసన్న మందిరం సమీపంలో వెళ్తున్న గిడ్డయ్యను లారీ ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఢీకొట్టి వెళ్లింది. కింద పడ్డ గిడ్డయ్య గాయాలపాలు కావడంతో సమాచారమందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



అరికెర సమీపంలో లభ్యమైన మృతదేహం

ఆలూరు రూరల్: మండలంలోని అరికెర గ్రామ సమీపంలోని ఎల్లార్తి రోడ్డులో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఏఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలు.. ఎల్లార్తి రోడ్డు నందు మహబూబ్ బాషా పొలంలోని డీపీ నంబర్ ఎస్ఎస్ 78 ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గుర్తు తెలియని శవం పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వారు ఘటనా స్థలానికి చేరుకుని అరికెర గ్రామస్తులను విచారించగా గత కొన్ని రోజుల నుంచి సదరు వ్యక్తి మతిస్థిమితం లేకుండా తిరుగుతుండేవాడని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ షాక్‌కు గురై మరణించాడా, ఇతర కారణాలున్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చంద్రశేఖర్ వెల్లడించారు.

హంద్రీ-నీవా పనులు పూర్తి చేయాలి

దేవనకొండ: సాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నాయకులు చేపట్టిన 30 గంటల నిరవధిక దీక్షను రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్ బుధవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. కరువుతో అల్లాడుతున్న దేవనకొండ మండలానికి హంద్రీ - నీవా ద్వారా సాగునీరు అందించాలని కోరారు. గుండ్లకొండ వద్ద స్లూయిజ్ గేట్లను ఏర్పాటు చేసి మిగతా గ్రామాలకు నీరు వచ్చేలా చూడాలన్నారు. రైతు సంఘం, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

పైర్లను కాపాడుకోవాలి

కృష్ణగిరి: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రబీలో సాగుచేసిన కంది, శనగ తదితర పంటలు ఏపుగా వస్తున్నాయని ఇలాంటి దశలోనే చీడపీడలను నివారించుకుంటేనే మంచి దిగుబడి వస్తుందని ఏఓ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం ఆయన కృష్ణగిరిలో వేరుశనగ పొలాలను పరిశీలించారు. పైర్లలో చీడపీడల నివారణకు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలన్నారు. తగిన మోతాదులో మందులు పిచికారీ చేయాలని సూచించారు. కంది పంటకు పూత బాగా వస్తోందని, పురుగు ఉధృతి కూడా అధికంగా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ముందు జాగ్రత్తగా మందులు పిచికారీ చేయాలని సూచించారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

ఎమ్మిగనూరురూరల్: గ్రామాల్లో ఉపాధిహామీ పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ అల్లీపీరా పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో ఏపీడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామాల్లో వలసలు నివారించేలా అధికారులు ఉపాధి పనులపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఉన్న ఊర్లో పనులు కల్పిస్తామని, వలస వెళ్లి ఇబ్బందులు పడవద్దని సూచించారు. మండలంలో 1204 మంది కూలీలు ఉపాధి పనులకు వచ్చారని ఈ సంఖ్య పెంచాలని ఆదేశించారు. అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని చెప్పారు. వలసలు వెళ్లే వారు తమ పిల్లలను బడి మాన్పించి తమతో పాటు తీసుకెళ్తున్నారని దీంతో వారి చదువులు మధ్యలోనే ఆగిపోతాయని తల్లిదండ్రులు గుర్తించుకోవాలన్నారు. ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీఓ విజయమోహన్, టీఏ, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్స్, ఫీల్డు అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ఆలూరు రూరల్: మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మండలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఈఓపీఆర్డీ ప్రకాష్ నాయుడు సూచించారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం లేకుండా చూడాలన్నారు. గత రెండు రోజులగా కురుస్తున్న వర్షాలకు కాల్వల్లో, కాలనీల్లో నిలిచిన నీరు తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని ఆదేశించారు. దోమల నివారణకు వీధుల్లో ఫాగింగ్ చేయించాలని చెప్పారు.

52,770 మందికి రైతు భరోసా

ఆలూరు రూరల్: వరుసగా ఐదో ఏడాది రెండో విడత వైఎస్సార్ రైతు భరోసా పీఎం కిసాన్ ద్వారా ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఆలూరు, ఆస్పరి, హొళగుంద, హాలహర్వి, చిప్పగిరి మండలాల్లోని 52,770 మంది రైతులకు రూ. 21.10 కోట్లు మంజూరైనట్లు ఏడీఏ సునీత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. రబీ పంటలసాగుకు పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం రూ.4 వేల చొప్పున రైతు ఖాతాల్లోకి జమ చేసిందన్నారు. ఈ ఏడాది రబీ సాధారణ సాగు 70 వేల హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 35 వేల హెక్టార్లలో రైతులు పప్పుశనగ, కంది, పత్తి, జొన్న తదితర పంటలు సాగు చేశారన్నారు.

రేపు 'డయల్ యువర్ డీఎం'

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో పరిధిలోని పరిసర ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం అమర్నాథ్ బుధవారం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని ప్రజలు 99592 25796 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సూచనలు తెలపవచ్చన్నారు.

దిశ యాప్‌తో రక్షణ



తుగ్గలిలో అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: మహిళలు, యువతులు, విద్యార్థినులు మొబైల్ ఫోన్లలో కచ్చితంగా దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని పట్టణ సీఐ మధుసూదన్‌రావు సూచించారు. బుధవారం పట్టణంలోని కుర్నికళ్యాణ మండపంలో పొదుపు మహిళలకు దిశ యాప్ పై అవగాహన కల్పించారు. వేధింపులు, దాడులు, ఇతర అపాయాల నుంచి దిశ యాప్ ద్వారా రక్షణ పొందవచ్చని వివరించారు. ఆపద సమయంలో దిశ యాప్ బటన్ నొక్కితే నిమిషాల వ్యవధిలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రక్షణ కల్పిస్తారని చెప్పారు. ఎస్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: మహిళల రక్షణే దిశ యాప్ లక్ష్యమని పత్తికొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం తుగ్గలిలో దిశ యాప్‌పై స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా డౌన్‌లోడ్, అవగాహన కార్యక్రమం చేపట్టారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): దిశ యాప్‌తో మహిళలకు భద్రత ఉంటుందని సీఐ సురేశ్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మహిళా పోలీసులతో సమావేశమై మహిళలు, యువతుల స్మార్ట్ ఫోన్లలో దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించాలన్నారు. అనంతరం మండలవ్యాప్తంగా 1763 మంది స్మార్ట్ ఫోన్లలో దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించినట్లు తెలిపారు.

సామాజిక తనిఖీలో రూ.58 వేల రికవరికీ ఆదేశం



ఉపాధి పనులపై విచారణ చేస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

గోనెగండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సామాజిక తనిఖీలో రూ.58,206 అవినీతి జరిగినట్లు డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. మండలంలో 20 గ్రామ పంచాయతీలకు సంబంధించి 01.04.2022 నుంచి 31.03.2023 వరకు జరిగిన ఉపాధి హామీ పనులు, ఫారెస్టు, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బుధవారం చేపట్టారు. 20 పంచాయతీల్లో ఉపాధి హామీ కింద 878 పనులు, పంచాయతీ రాజ్ కింద 33 పనులు, ఆర్‌డబ్ల్యూఎస్ కింద 2 పనులు ఫారెస్టు కింద 6 పనులు మొత్తం 919 పనులకు గాను రూ.12,24,46,196 ఖర్చు చేశారు. అలాగే 01.09.2023 నుంచి 30.09.2023 వరకు జరిగిన పనులు ఉపాధి హామీ కింద 211 పనులు, పంచాయతీ రాజ్ కింద 17 పనులు, ఫారెస్టు కింద 1 పనులు మొత్తం 229 పనులకు గాను రూ.1,23,30,212 ఖర్చు చేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన పనులను సోషల్ అడిట్ బృందం విచారించి అక్రమాలు గుర్తించింది. డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి మాట్లాడుతూ.. సామాజిక తనిఖీలో డీఆర్పీలు అన్ని గ్రామాల్లో పనులను పరిశీలించి సభ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. తనిఖీ బృందం సేకరించిన వివరాలను పరిశీలించి కొన్ని పంచాయతీల్లో మస్టర్లలో కొట్టివేసి రాయడం , కూలీల సంతకాలు లేకపోవడం తదితర లోపాలు గుర్తించినట్లు చెప్పారు. ఆయా అక్రమాలపై రికవరీకి ఆదేశించిన డబ్బును వెంటనే వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఏయే పంచాయతీల్లో ఎంత

అలువాల రూ.1235, బి.అగ్రహారం రూ.2400, బైలుప్పల రూ.1743, చిన్నమరివీడు రూ.2053, ఎర్రబాడు రూ.771, గంజిహళ్లి రూ.5,514, గోనెగండ్ల రూ.1500, హెచ్.కైరవాడి రూ.9,033, కులుమాల రూ.6,008, ఎస్.లింగందిన్నె రూ.3,824, నెరుడుప్పల రూ.2000, ఒంటిడుదిన్నె రూ.2500, పెద్దమరివీడు రూ.3,840, పెద్దనేలటూర్ రూ.5,324, పుట్టపాశం రూ.1732, తిప్పనూరు రూ.5,876, వేముగోడు రూ.2,853 కలిపి మొత్తం రూ.58,206 రికవరికీ ఆదేశించారు. జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ లోకేష్, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ నూర్ మహమ్మద్, ఏఓ విజయలక్ష్మి, ఏపీడీ అల్లీపీరా, సీఎల్ఆర్సీ కో-ఆర్డినేటర్ ఆదినారాయణ, ఎస్ఆర్పీ తిరుమలేష్, ఎంపీడీఓ ప్రవీణ్ మార్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.